

రామారం నుంచి గుర్రాలపోస వరకు కంకర రోడ్డును బీటీగా మార్చిన అధికారులు

## పూర్తయిన బీటీ రోడ్డు పనులు

రాయపోల్, జనవరి 11: సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని రామారం నుంచి మూడు కిలోమీటర్ల పొడవునా బీటీ నిర్మాణ పనులు నిలిచి ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఇటీవల 'నమస్తే తెలంగాణ'లో కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి స్పందించిన ఆర్అండ్‌బీ అధికారులు వారం నుంచి కంకర రోడ్డుపై బీటీ రోడ్డు పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. నెల రోజులు కంకర వేసి బీటీ వేయకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు, అధికారులు, నాయకులు సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కంకర రోడ్డు ఉండడంతో ఉన్న ఆర్టీసీ బస్సు సౌకర్యం రద్దుకావడంతో విద్యార్థులు ఉన్నత చదువులకు గజ్వేల్‌కు వెళ్లడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కున్నారు. కిలోమీటర్ల పొడవునా విద్యార్థులు కాలినడకన గుర్రాలపోస వరకు రాకపోకలు సాగించేవారు. గతంలో ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. రామారం నుంచి గుర్రాలపోస వరకు డబుల్ బీటీ రోడ్డు వేయడంతో అటు ప్రయాణికులు, ఇటు విద్యార్థుల ఇబ్బందులు పూర్తిగా తొలిగిపోయాయి. బీటీ రోడ్డు నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.


# నమస్తే తెలంగాణ
# మెదక్
I హైదరాబాద్, ఆదివారం 12 జనవరి 2025 MEDAK


## యువకుల మృతికి హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి

**బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి: హరీశ్‌రావు**



సిద్దిపేట, జనవరి 11: సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్‌లో హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు గల్లంతై మృతి చెందడంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువకుల అకాల మరణం మనసును కలిచివేసింది అన్నారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని ఆయన తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పండుగ వేళ బిడ్డల్ని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఈ కుటుంబాలకు ప్రభుత్వం రూ.15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## వృథాగా గోదావరి జలాలు

### లద్నూర్ రిజర్వాయర్ గేట్‌వాల్వ్ లీకేజీ



రిజర్వాయర్ కాల్వ నుంచి వృథాగా పోతున్న గోదావరి జలాలు

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 11: సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని లద్నూర్ రిజర్వాయర్ గేట్‌వాల్వ్ వద్ద లీకేజీ ఏర్పడడంతో కొన్ని రోజులుగా రిజర్వాయర్‌లోని నీరంతా వృథాగా పోతున్నది. రిజర్వాయర్ ప్రధాన కాల్వకు ఉప కాల్వలు లేకపోవడంతో కాల్వ చివరి భాగంలో నీరంతా రైతుల పొలాల్లోకి చేరుతున్నది. యాసంగి సీజన్‌కు ముందే గోదావరి జలాలు రిజర్వాయర్ నుంచి బయటకు వెళ్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గోదావరి జలాలు వృథాగా పోతే బోరుబావుల్లో నీరు ఉండదని రైతులు ఆందోళన చెందుతున్నారు. లీకేజీని అరికట్టాల్సిన దేవాదుల ప్రాజెక్టు అధికారులు తమకేం పట్టనట్టుగా వ్యవహరిస్తుండడంపై రైతులు మండిపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి గేట్‌వాల్వ్‌ను సరిచేసి లీకేజీని అరికట్టాలని రిజర్వాయర్ పరిధిలోని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# పండుగపూట విషాదం

- మృతులు హైదరాబాదీలు
- గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాల వెలికితీత
- గాలింపు చర్యలను పరిశీలించిన సిద్దిపేట సీపీ అనురాధ
- ప్రాజెక్టు వద్ద కరువైన పోలీసుల భద్రత, పెట్రోలింగ్
- బాధిత కుటుంబాలకు వంటేరు ప్రతాప్‌రెడ్డి పరామర్శ

## ఐదుగురిని బలితీసుకున్న సెల్ఫీ సరదా

### కొండపోచమ్మ సాగర్ వద్ద మిన్నంటిన రోదనలు



మృతదేహాలను బయటకు తరలిస్తున్న పోలీసులు

గజ్వేల్, జనవరి 11: సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ శనివారం కన్నీటి సంద్రంగా మారింది. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ ఇందిరానగర్‌కు చెందిన ఇద్దరు అన్నదమ్ములు గ్యార ధనుష్(20), గ్యార లోహిత్ (17), బన్సీలాల్‌పేటకు చెందిన చీకట్ల దినేశ్వర్ (17), అత్తాపూర్‌కు చెందిన సాహిల్ దీపక్ సుతార్ (19), ఖైరతాబాద్‌లోని చింతలబస్తీకి చెందిన ఉప్పల జతిన్ (17) ప్రాజెక్టులో నీట మునిగి మృత్యువాతపడడం బాధిత కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. సంక్రాంతి సెలవులు రావడంతో సరదాగా స్నేహితులంతా ఆనందంగా గడిపేందుకు శనివారం తెల్లవారుజామునే ఇండ్ల నుంచి బయలుదేరి ఒక్కొక్కరుగా ఏడుగురు స్నేహితులు కలుసుకొని స్కూటీలపై కొండపోచమ్మ సాగర్‌కు వచ్చారు. స్కూటీలపై వస్తుండగానే సరదాగా సెల్ఫీ వీడియోలు తీసుకుంటూ ఆనందంగా ప్రాజెక్టు వద్దకు చేరుకున్నారు. ప్రాజెక్టు వద్ద ఫొటోలు తీసుకుంటూ వారంతా నీళ్లలో ఆడేందుకు దిగారు. కాసేపు ప్రాజెక్టులో ఆడుకొని సెల్ఫీలు, వీడియోలు తీసుకునే క్రమంలో ప్రమాదవశాత్తు ప్రాజెక్టులో పడి ఐదుగురు యువకులు గల్లంతై మృతిచెందగా, మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. సురక్షితంగా బయటపడిన యువకులు డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం రాత్రి అయ్యే వరకు ఐదు మృతదేహాలు లభ్యమయ్యాయి.

**తల్లిదండ్రులకు కడుపుకోత...**

తమ కుమారులు మృతి చెందినట్టు సమాచారం తెలియడంతో గుండెలు బాదుకుంటూ తల్లిదండ్రులు కొండపోచమ్మ సాగర్ వద్దకు చేరుకున్నారు. మృతుల్లో ఇద్దరు అన్నదమ్ములు ధనుష్, లోహిత్ మృత్యువాత పడడంతో ఆ తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలింది. కష్టపడుతూ కుమారులను పోషించుకుంటున్నామంటూ తల్లిదండ్రులు నర్సింగరావు, జయంతి రోదనలు అక్కడ ఉన్నవారిని కంటతడి పెట్టించాయి. పెద్ద కుమారుడు ధనుష్ ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుండగా, చిన్న కుమారుడు లోహిత్ డిప్లొమా చదువుతున్నాడు. ఇక సాహిల్ దీపక్ సుతార్ తండ్రి లేకపోవడంతో అన్నీతానై తల్లి అనిత వంటపని చేసుకుంటూ కుమారుడిని డిప్లొమా చదివిస్తున్నది. చీకట్ల దినేశ్వర్ డిప్లొమా చదువుతుండగా, తండ్రి కిషన్ కారు డ్రైవర్‌గా, జతిన్ డిగ్రీ చదువుతుండగా తండ్రి కోటేశ్వర్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. చేతికందిన కుమారులు విగత జీవులుగా మారడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. మృతదేహాలను చూసేందుకు స్నేహితులు, కాలనీవాసులు ప్రాజెక్టు వద్దకు భారీగా చేరుకుని విలపించారు.

**ప్రాజెక్టు వద్ద కొరవడిన నిర్లక్ష్యం...**

కొండపోచమ్మ ప్రాజెక్టు పైకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రెండు గేట్ల వద్ద సిబ్బంది లేకపోవడంతో సెలవు రోజుల్లో వచ్చే యువకులు నేరుగా ప్రాజెక్టు లోపలికి వెళ్లి నీటిలో సెల్ఫీలు తీసుకుంటూ గడుపుతున్నారు. ప్రాజెక్టు వద్ద పర్యవేక్షణ సిబ్బంది లేకపోవడంతో గంటల తరబడి యువతీయువకులు ప్రమాదకర ప్రాంతానికి చేరుకొని ఫొటోలు దిగుతున్నారు. ప్రాజెక్టు వద్దకు వచ్చే వారిపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నదని స్థానికులు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రెండు గేట్ల వద్ద పోలీస్ బందోబస్తు ఉండేది. అనుమతి తీసుకొని మాత్రమే సందర్శకులు వెళ్లేవారు. చూసేందుకు వెళ్లిన వారిని అక్కడి సిబ్బంది పర్యవేక్షించేవారు. ముషీరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు ప్రాజెక్టులో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే పడి మృతిచెందినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.



కుటుంబ సభ్యుల ద్వారా వివరాలు తెలుసుకుంటున్న సీఐ లతీఫ్

## ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే యువకుల మృతి

- వంటేరు ప్రతాప్‌రెడ్డి



మార్చురీలో మృతదేహాలను పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపోచమ్మ సాగర్ వద్ద సెక్యూరిటీ లేకపోవడం, పెట్రోలింగ్ చేయకపోవడంతోనే ఈ ఘటన జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే దీనికి కారణమని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. యువకుల మృతికి నైతిక బాధ్యత ప్రభుత్వం వహించాలని, గతంలోని కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు చుట్టూ పోలీసులు భద్రత కాసేవారని, ఎప్పటికప్పుడు పెట్రోలింగ్ నిర్వహిస్తూ సందర్శనకు వచ్చే వారిని అప్రమత్తం చేశారన్నారు. మృతుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియో అందించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలను సీఎం స్వయంగా పరామర్శించి ఎక్స్‌గ్రేషియో అందించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

# పిల్లలకు విద్య, క్రమశిక్షణ అందించాలి

- ఆస్తులు ముఖ్యం కాదు
- హైకోర్టు జడ్జి విజయసేన్‌రెడ్డి
- చేర్యాల ఫస్ట్ క్లాస్ సివిల్ జూనియర్ కోర్టు ప్రారంభం



హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్‌రెడ్డికి జ్ఞాపిక అందిస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేసిన విజయసేన్‌రెడ్డి

చేర్యాల, జనవరి 11: ప్రజల ఆర్థిక స్థితిగతులు గతంలో పోలిస్తే ప్రస్తుతం పెరిగాయని, 20, 30 ఏండ్లుగా ఎంతో కష్టపడితే అది సాధ్యమైందని, ఇప్పుడు పెరిగిన ఆర్థిక స్థితిని చూసి ఈ జనరేషన్‌కు కష్టం విలువ తెలియకుండా పెంచరాదని తెలంగాణ హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి బి.విజయసేన్‌రెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో ఫస్ట్ క్లాస్ సివిల్ జూనియర్ కోర్టును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తులు, అంతస్తులు కాదని మంచి విద్య, క్రమశిక్షణ అందించాలన్నారు. ప్రజలకు సత్వర న్యాయం అందాలంటే న్యాయవాదులు ఉత్సాహంగా పనిచేయాలన్నారు. కోర్టు ప్రారంభంతో చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట ప్రాంత ప్రజలకు న్యాయ సేవలను అందించేందుకు తాము బాధ్యతగా చేర్యాల జూనియర్ సివిల్ కోర్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. లాయర్ వృత్తి చాలా స్వేచ్ఛతో కూడుకున్నదని, ప్రజలకు మంచి జరగాలంటే లాయర్లు ఉత్సాహంతో పనిచేసి కోర్టుల ద్వారా ప్రజలకు కాలయాపన కాకుండా న్యాయసేవలు అందించాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. కోర్టు కేసుల పరిష్కారంలో నూతన టెక్నాలజీ చాలా ఉపయోగకరంగా ఉంటుందని, భవిష్యత్తులో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ న్యాయ వ్యవస్థలో కీలక పాత్ర పోషించనుందన్నారు. సీనియర్ లాయర్లు జూనియర్ లాయర్లకు అవకాశాలు కల్పించి, వారు వృత్తిపరంగా ఎదిగేందుకు ప్రోత్సహించాలని సూచించారు. కోర్టు ప్రారంభానికి పెద్దసంఖ్యలో వచ్చిన మిమ్మల్ని చూస్తేనే ఈ ప్రాంతంలో కోర్టు ఏర్పాటు ఎంత అవసరమో తెలుస్తుందని హైకోర్టు జడ్జి బి.విజయసేన్‌రెడ్డి అన్నారు.

### కోర్టు ఏర్పాటుకు సహకరించిన వారికి ధన్యవాదాలు

- జిల్లా జడ్జి సాయి రమాదేవి

అనంతరం జిల్లా ప్రిన్సిపాల్ అండ్ సెషన్స్ జడ్జి సాయి రమాదేవి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో న్యాయ వ్యవస్థకు ప్రముఖ స్థానం ఉందని, చేర్యాలలో కోర్టు ఏర్పాటుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంత పౌరులకు సత్వర న్యాయసేవలు అందించేందుకు కోర్టు ఏర్పాటు చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. ఇన్‌చార్జి కలెక్టర్ అబ్దుల్ హమీద్ మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రయోజనాల పరిరక్షణకు ఈ కోర్టు ఏర్పాటు ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎన్.జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. చేర్యాలలో కోర్టు ఏర్పాటు 20 ఏండ్ల కలని, ఇప్పుడు అది నెరవేరిందన్నారు. ఈ సందర్భంగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మీ హైకోర్టు జడ్జి, జిల్లా జడ్జిని పూలబొకేలు అందించి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా దివ్యాంగులకు ఉపకరణాలు అందజేశారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా జడ్జి, సిద్దిపేట, జనగామ, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సభ్యులు, న్యాయవాదులు, న్యాయ శాఖ ఉద్యోగులు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయసేన్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి



మెదక్ జిల్లా టేక్మాల్‌లో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, టేక్మాల్ మండల నాయకులు



మెదక్ జిల్లా టేక్మాల్‌లో మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు

# రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

- కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చింది..
- ప్రజలనే కాదు కాంగ్రెస్ కార్యకర్తలనూ వంచించింది..
- అంబేద్కర్ ఇచ్చిన హక్కులను కాలరాస్తున్న సర్కారు
- ఆశపడితే గోస పడతాం అన్న కేసీఆర్ మాట నిజమైంది
- స్థానిక ఎన్నికల్లో లబ్ధి కోసమే రైతుభరోసా ప్రకటన
- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ధ్వజం

టేక్మాల్, జనవరి 11: ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించిందని, స్వయంగా ఆరు గ్యారంటీలను ప్రకటించిన రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీల మాటలు నీటి మూటల వలె తేలిపోయాయని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఎకరానికి రూ. 10వేల రైతుబంధు ఇవ్వగా, తాము ఎకరానికి రూ.15వేలు ఇస్తామని మాయమాటలతో రైతులను మభ్యపెట్టి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రూ.15వేలకు బదులుగా రూ. 12వేలు ఇస్తామని రైతులకు వెన్నుపోటు పొడిచిన వైఖరిని నిరసిస్తూ మెదక్ జిల్లా టేక్మాల్‌లో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని ఇచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని బాండ్ పేపర్‌పై రాసి ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అమలులో విఫలమైందన్నారు. మాయ మాటలు చెప్పిన వారు ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. రూ.2లక్షల రుణమాఫీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ చెబుతున్నప్పటికీ ఇప్పటికీ చాలా గ్రామాల్లో రుణమాఫీ కాలేని రైతులు అనేక మంది ఉన్నారని, పార్టీ మాటలు నమ్మి మోసపోయామని కాంగ్రెస్ కార్యకర్తలే బాధపడుతున్నారని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన రైతు బంధు వస్తలేదని, కేసీఆర్ కిట్టు వస్తలేదని, కల్యాణలక్ష్మి తులం బంగారం వస్తలేదన్నారు. ఈ వానకాలం ధాన్యం కొనుగోలులో సగానికిపైగా ధాన్యం దళారుల పాలైందని చంటి క్రాంతికిరణ్ విమర్శించారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వంపై నమ్మకం లేని రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్ముకున్నారని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో 24గంటలు వ్యవసాయానికి కరెంట్ ఇస్తే, ఇప్పుడు ఎప్పుడు వస్తుందో... ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందన్నారు. కేసీఆర్ చెప్పినట్లు ఆశపడితే గోస పడతాం అనే విషయం నిజమైందన్నారు. ఇప్పుడు ఇస్తామంటున్న రైతు భరోసా కూడా కేవలం స్థానికల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేసిన ప్రకటన తప్ప రైతుల శ్రేయస్సు కోసం చేసింది కాదని ఎద్దేవా చేశారు. అంబేద్కర్ ప్రజలకు ఇచ్చిన హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్‌కు స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని చంటి క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు. ఆందోళనలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జైపాల్‌రెడ్డి, నాగభూషణం, పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డి, పార్టీ టేక్మాల్ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప, నాయకులు సిద్దయ్య, సలీం, భాస్కర్, రవి, సుధాకర్, శ్రీనివాస్, హనుమగౌడ్, వెంకట్ గౌడ్, బన్నయ్య, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

- అధికారులతో సమీక్షలో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 11: రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. ఈనెల 21 నుంచి 24 వరకు పంచాయతీల పరిధిలో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలను పక్కాగా నిర్వహించాలన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురితో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూభారతి పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా రైతుభరోసా పథకం కింద అర్హులను క్షేత్ర స్థాయిలో గుర్తించాలన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్, మండల వ్యవసాయ శాఖ అధికారి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ విస్తరణ, రెవెన్యూ అధికారులతో కమిటీలను నియమించుకొని విలేజ్ మ్యాప్, గూగుల్ మ్యాప్ ఆధారంగా వ్యవసాయ యోగ్యమైన భూములను నిర్ధారించాలన్నారు. 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభల్లో వివరాలను వెల్లడిస్తూ, గ్రామసభ ఆమోదం పొందిన మీదట సంబంధిత పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలన్నారు. సాగు భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఏడాదికి రూ.12వేలను అందించేందుకు జిల్లాలో అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. 2023-24 సంవత్సరంలో కనీసం 20రోజుల పాటు ఉపాధి హామీ పనులు చేసిన వ్యవసాయ కూలీ కుటుంబాలు ఆత్మీయ భరోసా పథకానికి అర్హులని సూచించారు. రేషన్ కార్డుల జారీ విషయంలోనూ క్షేత్ర స్థాయి పరిశీలన జరపాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో డీఆర్డీఏ పీడీ జ్యోతి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, హౌజింగ్ పీడీ, ఆర్డీవోలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ ముఠా గుట్టురట్టు

- నిషేధిత ఆల్ఫాజోలం డ్రగ్స్‌ను పట్టుకున్న పోలీసులు
- రూ.60 కోట్ల విలువ చేసే ఆస్తుల గుర్తింపు
- పోలీసుల అదుపులో నిందితులు
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేశ్



సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రూపేశ్


గుమ్మడిదల,(సంగారెడ్డి), జనవరి 11: నిషేధిత ఆల్ఫాజోలం డ్రగ్స్ తయారు చేస్తున్న ముఠాను సంగారెడ్డి జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. శనివారం సంగారెడ్డిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో మీడియాకు ఎస్పీ చెన్నూరి రూపేశ్ వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 31న గుమ్మడిదల పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన కేసు ఆధారంగా పోలీసులు చేసిన విచారణలో జిన్నారం, గుమ్మడిదల, సీసీఎస్ పోలీసులు నిజాలను బయటకు తీశారు. ఈ దందాలో ముత్తంగికి చెందిన గిర్మగౌని సుధీర్‌గౌడ్‌ను ప్రధాన నిందితుడిగా గుర్తించారు. శుక్రవారం సాయంత్రం గిర్మగౌని సుధీర్‌గౌడ్ తన కారులో ముత్తంగి నుంచి మెదక్ వెళ్తున్న పోలీసులు గుర్తించి, అతని వాహనాన్ని మంభాపూర్ గేట్ వద్ద పట్టుకుని విచారించారు. విచారణలో సుధీర్‌గౌడ్ తన నేరాన్ని అంగీకరించి, ఆల్ఫాజోలం విక్రయించేందుకు మెదక్ వెళ్తున్నట్లు ఒప్పుకున్నాడు. ముత్తంగిలోని తన్మయి హోమ్స్‌లో ఉండే ఏ1 గిర్మాగౌని సుధీర్‌గౌడ్ రియల్ ఎస్టేట్ చేస్తుంటాడు. స్వస్థలం మెదక్ జిల్లాలోని పిట్లంబేస్. జీవనోపాధి కోసం బీరంగూడలో నివాసం ఉంటూ డబ్బు సంపాదన మీద దురాశతో 2017లో కానుకుంటకు చెందిన విశాల్‌గౌడ్ అనే వ్యక్తితో పరిచయం చేసుకున్నాడు. అతని నుంచి ఆల్ఫాజోలం తీసుకుని తన భార్య, తమ్ముడితో కలిసి విక్రయించేవాడు. 2020లో గుమ్మడిదలకు చెందిన సాయిగౌడ్ అనే వ్యక్తిని పరిచయం చేసుకుని అతని నుంచి ఆల్ఫాజోలం కొని అమ్మేవాడు. ఆ తర్వాత విశాల్‌గౌడ్ ముత్తంగికి చెందిన భీశ్వేశ్వర్‌సింగ్‌ను పరిచయం చేయగా, అప్పటి నుంచి వీరందరూ కలిసి ఈ నిషేధిత ఆల్ఫాజోలం వ్యాపారం చేస్తున్నారు. కమీషన్ ద్వారా వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో అధిక లాభాలను చూడాలని సొంతంగా వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. భీశ్వేశ్వర్‌సింగ్‌కు ఆల్ఫాజోలం తయారు చేసే పద్ధతి తెలుసని, సొంతంగా ఆల్ఫాజోలంను తయారు చేసి అధిక డబ్బును సంపాదించవచ్చని 2023లో హైదరాబాద్ శివారులోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాచారం గ్రామ శివారులో సర్వేనంబర్ 39 గల సాయిప్రియ కెమికల్స్ కంపెనీని కొనాలని లక్ష్మణ్‌గౌడ్ నిర్ణయించుకున్నారు. ముత్తంగికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి రాజేశ్వర్‌శర్మను భీశ్వేశ్వర్‌సింగ్ పరిచయం చేయగా, ముగ్గురు కలిసి 2023 మేలో లక్ష్మణ్‌గౌడ్ కంపెనీని కొనుగోలు చేశారు. ఆ కంపెనీలో నిషేధిత ఆల్ఫాజోలం తయారుచేసే యంత్రాలను ఏర్పాటు చేశారు. సుధీర్‌గౌడ్ తన డ్రైవర్ బోడ శశికుమార్ సహాయంతో ఆల్ఫాజోలం తయారీకి కావాల్సిన ముడిపదార్థాలను కొనుగోలు చేస్తుండేవారు. ఒక బ్యాచ్‌కు 50 కిలోల చొప్పున నెలకు 1-2 బ్యాచ్‌ల ఆల్ఫాజోలం తయారుచేసి కేజీ రూ.4 లక్షల చొప్పున హైదరాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో విక్రయించి డబ్బులు సంపాదించేవారు. వీరిని జిన్నారం, గుమ్మడిదల, సీసీఎస్ పోలీసులు చాకచక్యంగా పూర్తి ఆధారాలతో పట్టుకున్నారు.

**నిందితుల వివరాలు వెల్లడించిన ఎస్పీ..**

ఏ1గా గిర్మగౌని సుధీర్‌గౌడ్(ముత్తంగి), ఏ2 గా భీశ్వేశ్వర్‌సింగ్(రామరాజు నగర్, ముత్తంగి), ఏ3గా రాజేశ్వర్‌శర్మ (పటాన్ చెరు,ముత్తంగి) , ఏ4గా గిర్మాగౌని శ్రీవాణి (తన్మయిహోమ్స్, ముత్తంగి), ఏ5గా బోడ శశికుమార్(బీరంగూడ)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.వీరి నుంచి 740 గ్రాముల నిషేధిత ఆల్ఫాజోలం, 3 కార్లు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద సుమారు రూ.60 కోట్ల విలువ గల ఆస్తులు గుర్తించారు. అందరినీ అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు ఎస్పీ తెలిపారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే వెంటనే సంగారెడ్డి జిల్లా పోలీసులకు, ఎస్-న్యాబ్ నంబర్ 87126 56777కు సమాచారం అందించాలని సూచించారు. డ్రగ్స్ ముఠాను పట్టుకోవడానికి కృషిచేసిన పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, జిన్నారం సీఐ నియాముద్దీన్, గుమ్మడిదల ఎస్సై మహేశ్వర్ రెడ్డి, సీసీఎస్ ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని ఎస్పీ రూపేశ్ అభినందించారు.

## పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

రాయపోల్, జనవరి 11: హరితహారంలో రోడ్లకు ఇరువైపులా నాటిన చెట్లను నరికి వేయడంతో పచ్చదనం లేకుండా పోతున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలో గజ్వేల్, దౌల్తాబాద్ ప్రధాన రహదారిపై హరితహారం నాటిన మొక్కలు ఏపుగా పెరిగి నీడ, గాలి, ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. వీటిని విద్యుత్ సిబ్బంది ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారు. రాయపోల్ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి కొత్తపల్లి వరకు ఏపుగా పెరిగిన చెట్లను నరికివేయగా, వాహనదారులు, ప్రకృతి ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ వైర్లకు అనుతున్నాయని, అందుకే నరికివేస్తున్నట్లు విద్యుత్ అధికారులు సమాధానమిస్తున్నారు. ఈ విషయంపై మండల విద్యుత్ అధికారి శ్రీనివాస్‌రావును వివరణ కోరగా.. తరుచుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పతుండడంతో చెట్ల కొమ్మలు నరికివేశామన్నారు.



కొత్తపల్లి వద్ద రోడ్డుకు ఇరువైపులా చెట్లను నరికి వేసిన విద్యుత్ సిబ్బంది